# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.**

**2. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి కింద 5 వేల 700 కోట్లు రుణాలు మంజూరు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.**

**3. ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు.**

**4. రాష్ట్రంలో యోగాంధ్ర ద్వారా ప్రభుత్వం నెలరోజుల పాటు యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు.**

==========================

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పిల్లలందరికీ తల్లికి వందనం నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 15 వేల రూపాయల చొప్పున అందిస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

..వాయిస్... 32 సెకన్లు

--------------------------

అర్హులరందరికీ తల్లికి వందనం పథకం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో తల్లికి వందనం పథకం అమలు తీరుపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, అర్హత ఉండి నిధుల జమకాని వారి నుంచి గ్రామ, వార్డు సచివాలయాలు, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించాలని చెప్పారు. క్రియాశీలకంగా లేని తల్లుల బ్యాంక్ ఖాతాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని అధి కారులను ఆదేశించారు.

--------------------------

స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో 5 వేల 700 కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేయాలని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి

శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విజయవాడలోని సెర్ప్ కేంద్ర కార్యాలయంలో స్త్రీనిధి త్రైమాసిక పురోగతిపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి జిల్లాలోని అర్హులైన మహిళలకు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు వారి అవసరాలను అనుగుణంగా తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని ఆదేశించారు. డిజిటల్ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, దాని ద్వారా మహిళలకు మరింత సులభంగా సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో న్యాయ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన న్యాయ స్థానాల భవనాలకు, గృహ సముదాయాల నిర్మాణాలకు ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్ర న్యాయశాఖ ద్వారా నిధులు వచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాలను ప్రారంభించేందుకు న్యాయ శాఖ తరపున అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీకాకుళం, తిరుపతి, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం జిల్లాల్లో యోగా కార్యక్రమాలు ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతపురంలోని స్థానిక పెరేడ్ మైదానంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ మాట్లాడుతూ..

..వాయిస్... 23 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో యోగాంధ్ర ద్వారా ప్రభుత్వం నెలరోజుల పాటు పెద్ద ఎత్తున యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఆమిరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఉపసభాపతి పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ.. పశ్చిమగోదావరి జిల్లాలో 8 లక్షల 50 వేల మంది యోగాంధ్ర కార్యక్రమం కోసం నమోదు చేసుకున్నారని చెప్పారు. దేశంలో యోగా అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తొచ్చేలా విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర 2025ని విజయవంతం చేయాలని కోరారు.

---------------------------

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తణుకు శాసనసభ్యులు ఏ. రాధాకృష్ణ కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ, దాతల నుంచి సేకరించిన రక్తాన్ని మదర్ బ్లడ్ బ్యాంక్‌లో నిల్వ చేసి... గర్భిణీలకు

అవసరమైన సందర్భంలో ఉపయోగిస్తామన్నారు. త్వరలో రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని ఆయన తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---

ప్రముఖ నవలా రచయిత శివరాజు వెంకట సుబ్బారావు జయంతి ఈ రోజు. 1916 జూన్ 14వ తేదీన ఆంధ్రప్రదేశ్లోని ఏలూరు పట్టణంలో జన్మించిన ఆయన "బుచ్చిబాబు" అనే కలం పేరుతో పలు రచనలు చేశారు. కేవలం నవలా రచయితగా మాత్రమే కాకుండా... సాహిత్య కారులుగా, చిత్ర కారులుగా, నటులుగా కూడా ఆయన ప్రసిద్ధి చెందారు. కథా సాహిత్య వికాసానికి ఎంతగానో కృషి చేశారు. 1945 నుండి 1967 సంవత్సరం మధ్య ఆకాశవాణికి కూడా ఆయన సేవలు అందించారు. ఆయన రచనల్లో "చివరకు మిగిలేది" రచనకు మంచి పేరు వచ్చింది. షేక్ స్పియర్ సాహితీ పరామర్శ గ్రంథానికి సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. 80కి పైగా వున్న ఆయన కథలు 7 సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. 1967వ సంవత్సరం సెప్టెంబర్ 20వ తేదీన శివరాజు వెంకట సుబ్బారావు తుదిశ్వాస విడిచారు.

---

రైతులకు సులభంగా విత్తనాలను అందించడమే లక్ష్యంగా రైతు సేవా కేంద్రాలను సందర్శిస్తున్నామని వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావుతో కలిసి ఎన్టీఆర్ జిల్లాలోని గొల్లపూడి రైతు సేవా కేంద్రాన్ని నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ, డి – కృషి యాప్ ద్వారా చేపట్టిన విత్తనాల పంపిణీలో వినియోగిస్తున్న ప్రామాణిక విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. యాప్లో దరఖాస్తు చేసిన రైతులకు ప్రాధాన్య క్రమంలో విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

---

స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు కానేటి మోహనరావు వర్ధంతి ఈరోజు. 1925 డిసెంబరు 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు మండలం దిండి గ్రామంలో జన్మించిన ఆయన... 1952వ సంవత్సరంలో రాజమండ్రి లోక్సభ నియోజకవర్గం నుండి 1వ లోక్సభకు ఎన్నికయ్యారు. 1937 నుండి తాలూకా, జిల్లా కమ్యూనిస్టు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వ్యవసాయ కూలీల ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. నిజాం పరిపాలనను వ్యతిరేకించినందుకు 1942 నుండి 1945 మధ్య రాజోలు, అమలాపురం, రాజమండ్రి, రామచంద్రపురం, ఏలూరులలో కారాగార శిక్షను అనుభవించారు. తొలి పార్లమెంటు వజ్రోత్సవాల నేపథ్యంలో 2012లో భారత ప్రభుత్వ సన్మానం అందుకున్న కానేటి మోహనరావు 2014 జూన్ 14వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...23 సెకన్లు

---

రాష్ట్రంలో రక్తహీనత–ఎనీమియానూ తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని  ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడల్ అధికారిణి డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ నిర్వహించిన శిక్షకులకు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎనీమియా నివారణకు కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత బాధితులకు చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియాగా నిర్ధారణైన కేసులకు తప్పనిసరిగా ఎనీమియా పరీక్ష కూడా చేయాలని తెలిపారు.

======================